

'చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి'


సీతంపేట రూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సోమగండిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారుల ఎత్తు, బరువుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేంద్రాలకు స్టాక్ సక్రమంగా సరఫరా జరిగేలా చూసుకోవాలని సీడీపీవో రంగలక్ష్మికి సూచించారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. త్వరలో సోమగండి రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు.

లెక్క తేలింది.. ఇక చర్యలేనా?



- జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూములు 14,864 ఎకరాలు
- మొదటిస్థానంలో సీతంపేట
- రెండు, మూడు స్థానాల్లో మక్కువ, పార్వతీపురం మండలాలు
- క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి.. నివేదికలు సిద్ధం చేసిన అధికారులు
- గత వైసీపీ సర్కారు పాలనలో సాగిన వ్యవహారం





పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారు హయాంలో జిల్లాలో అడ్డగోలుగా సాగిన ఫ్రీహోల్డ్ భూముల లెక్క తేలింది. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సిద్ధం చేశారు. 'మన్యం'లో ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని చెప్పొచ్చు. అధికారుల గణాంకాల ప్రకారం.. జిల్లాలో ఫ్రీ హోల్డ్ అయిన భూమి విస్తీర్ణం 14,864 ఎకరాలుగా నమోదైంది. పార్వతీపురం డివిజన్‌లో 7,337 ఎకరాలు, పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో 7,527 ఎకరాలు ఫ్రీ హోల్డ్ జాబితాలో చేరాయి. ఇందులో సీతంపేట మండలం 4,547 ఎకరాలతో మొదటి స్థానంలో, మక్కువ 2,442 ఎకరాలు, పార్వతీ పురం 2,109 ఎకరాలతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయి.

మండలాల వారీగా ...

- పార్వతీపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో చూస్తే.. పార్వతీపురం మండలంలో 2,109.86 ఎకరాలు, సీతానగరంలో 548.525 , బలిజిపేటలో 224.67, సాలూరులో 611.229, పాచిపెంటలో 16.33, మక్కువలో 2442.3, కొమరాడలో 795.322, గురుగుబిల్లిలో 588.985 చొప్పున మొత్తంగా 7337.22 ఎకరాలు ఫ్రీహోల్డ్ అయ్యాయి.
- పాలకొండ రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి జియ్యమ్మవలస మండలంలో 334.473 ఎకరాలు, గుమ్మలక్ష్మీపురంలో 670.2, కురుపాంలో 17.19, పాలకొండ మండలంలో 191.55, సీతంపేటలో 4,547.06, భామినిలో 1,699.02, వీరఘట్టంలో 67.7 ఎకరాల చొప్పున ఈ డివిజన్‌లో 7,527.2 ఎకరాలు ఫ్రీహోల్డ్ జాబితాలో చేరాయి.

ఆ రెండు మండలాల్లో..

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది పార్వతీపురం, బలిజిపేట మండలాల్లో పేదల దగ్గర భారీగా భూములను కొనుగోలు చేశారు. వాటిని ఫ్రీహోల్డ్‌లో చేర్చేందుకు అప్పట్లో ఓ యువ మంత్రి వ్యూహ రచన చేశారు. ఈ మేరకు జిల్లా అధికారులపై కూడా ఒత్తిడి తెచ్చారు. దీంతో పెద్ద ఎత్తున సర్వే బృందాలు ఆ భూములను సర్వే చేశాయి. ఈ లోపుగా 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురితమవడం, మరోవైపు సాధారణ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సర్వేకు బ్రేక్ పడింది. మొత్తంగా ఆ రెండు మండలాల్లో భూములు ఫ్రీ హోల్డ్ జాబితాలో చేరలేదు. ఈ విషయాన్ని డీఆర్వో హేమలత వద్ద ప్రస్తావించగా.. 'జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములపై సర్వే చేసి నివేదిక సిద్ధం చేశాం .. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రభుత్వానికి పంపిస్తాం.' అని ఆమె తెలిపారు.
- వాస్తవంగా గత వైసీపీ సర్కారు తీసుకొచ్చిన ఫ్రీ హోల్డ్ జీవోను కొంతమంది భూస్వాములు వారికి అనుకూలంగా మలుచుకున్నారు. కొందరు అక్రమార్కులు జీవోను అడ్డం పెట్టుకుని పేదల పేరున ఉన్న అసైన్డ్ భూములను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మరికొందరు అధికారుల సహకారంతో నిబంధనలకు విరుద్ధంగా ఆ భూములను సొంతం చేసుకున్నారు. లీజుల పేరిట తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. తెరవెనక కొంతమంది వైసీపీ నేతలు కూడా అధికారులపై ఒత్తిడి తెచ్చి అప్పట్లో వారికి అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో భూములను ఫ్రీహోల్డ్ జాబితాలో చేర్పించారనే ఆరోపణలున్నాయి. అయితే వాటిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం 'ఫ్రీహోల్డ్'పై దృష్టి సారించింది. తాజాగా అధికారులు వాటిపై నివేదికలు సిద్ధం చేయడంతో సర్కారు ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

బాల్యాన్ని చిదిమేస్తున్న క్యాన్సర్

6లో



- పిల్లల్లో పెరుగుతున్న బాధితులు
- తొలిదశలో గుర్తిస్తే నివారణకు అవకాశం
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో వైద్యం
- నేడు ఇంటర్నేషనల్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్‌డే

గుండెకు అభయం



- గుండెపోటుకు ఉచితంగా ఖరీదైన ఇంజక్షన్లు
- సకాలంలో స్పందిస్తేనే..
- ప్రభుత్వాసుపత్రులకు సరఫరా

6లో

ఎప్పుడిస్తారో?



- కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లావాసుల ఎదురుచూపు
- త్వరగా ప్రక్రియ ప్రారంభించాలని విన్నపం

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు కీలకం. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత పథకాల అమలు వేగవంతం చేస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నో కుటుంబాలు కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ వైఖరితో రేషన్ కార్డులు లేక.. ఇళ్ల, ఇంటి స్థలాల మంజూరు విషయంలో దారుణంగా నష్టపోయిన జిల్లా ప్రజలు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2,22,049 తెలుపు రేషన్‌కార్డులు, 55,104 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో ఎంతోమంది వాటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వాస్తవంగా పాలకొండ డివిజన్‌లో ఉన్న ఏడు మండలాల పరిధిలో 259 ఎఫ్‌పీ (ఫెయిర్ ప్రైస్) షాపులు ఉన్నాయి. పార్వతీపురం డివిజన్‌లోని ఎనిమిది మండలాల పరిధిలో 319 ఎఫ్‌పీ షాపులు ఉన్నాయి. ఇందులో 518 ఆన్‌లైన్ ఎఫ్‌పీ షాపులు కాగా, 60 ఆఫ్‌లైన్‌లో నడుస్తున్నాయి. వీటన్నింటికీ రేషన్ సరఫరా చేసేందుకు ఎనిమిది మండల స్థాయి స్టాక్ పాయింట్లు (ఎంఎల్ఎస్) ఉన్నాయి. వాటి నుంచి మండలానికి అవసరమైన ప్రతి రేషన్ షాపునకు బియ్యం, కందిపప్పు, పంచదార, రాగి పిండి తదితర వాటిని సరఫరా చేస్తున్నారు. వీటిని ప్రజలకు అందించేందుకు పార్వతీపురం డివిజన్‌లో 110, పాలకొండ డివిజన్‌లో 86 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. కాగా ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డు అత్యంత కీలకం. ఇళ్ల స్థలాల మంజూరు, పిల్లలు పాఠశాలల ప్రవేశానికి , వైద్యసేవలకు కూడా ఇది తప్పనిసరి. అయితే గత నాలుగేళ్లుగా రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు, కొత్త కార్డుల కోసం చాలామంది దరఖాస్తులు చేసుకున్నారు. అయినా గత వైసీపీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియను కూటమి ప్రభుత్వం త్వరగా చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇంకా రాలేదు

కొత్త రేషన్‌కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే కలెక్టర్ ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, డీఎం, సివిల్ సప్లైస్,

కుంభమేళా నుంచి తిరిగొస్తూ..

- వారణాసిలో జిల్లా మహిళ మృతి
- స్వగ్రామం ఎన్‌కే రాజపురంలో విషాదఛాయలు



రాజేశ్వరి (ఫైల్)

పాలకొండ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న కుంభమేళాకు వెళ్లిన జిల్లా మహిళ తిరుగు ప్రయాణంలో మృతి చెందారు. దీంతో స్వగ్రామం ఎన్‌కే రాజపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఆర్తమూడి రాజేశ్వరి (58) తన భర్త భాగ్యారావుతో పాటు మరో 35 మందితో కలిసి వారం రోజుల కిందట ప్రత్యేక బస్సులో కుంభమేళాకు బయల్దేరి వెళ్లారు. ప్రయాగ్‌రాజ్‌లో పుణ్య స్నానమాచరించిన అనంతరం వారు వారణాసి వెళ్లారు. శుక్రవారం కాశీవిశ్వేశ్వరుడిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలోనే రాజేశ్వరి ఆయాసంతో తీవ్ర అస్వస్థతకు గురై అక్కడ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. భాగ్యారావు రిటైర్డ్ ఉద్యోగి. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా వారణాసిలోనే రాజేశ్వరి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

పోస్టల్ ప్రైవేటీకరణ వద్దు

- తపాలా శాఖ ఉద్యోగుల నిరసన



పార్వతీపురం పోస్టాఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బెలగాం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని పోస్టల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పార్వతీపురంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద పోస్టల్ జాయింట్ యాక్షన్ కమిటీ (పీజేసీఏ) ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పీజేసీఏ నాయకుడు ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ.. తమ సమస్య లను పరిష్కరించాలని ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఫలితం ఉండడం లేదన్నారు. కమలేష్ చంద్ర కమిటీలోని సానుకూల అంశాలు వెంటనే అమలు చేయాలని, ఐడీసీ, సీడీసీ ప్రతిపాదనలను రద్దు చేయాలని నినదించారు. సమస్యలు పరిష్కరించే వరకు వివిధ దశల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకు నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేపడతామని, 25 నుంచి ధర్నాలు చేసి సమ్మె నోటీసులు ఇస్తామని వెల్లడించారు. మార్చి 18 నుంచి నిరవధిక సమ్మె చేపడతామన్నారు. ఈ నిరసనలో పీజేసీఏ నాయకులు రవీంద్రనాథ్, అప్పారావు, గౌరీశంకర్ తదితరులున్నారు.

ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయాలి

- డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశం

పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భిణులకు ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో ఎస్‌భాస్కరరావు ఆదేశించారు. శుక్రవారం ఎన్‌జీవో హోమ్‌లో ఆశా నోడల్ అధికారులతో ఆయన మాట్లాడుతూ.. మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేలందించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కాన్పు సమయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ రక్తహీనత సమస్య ఉండరాదన్నారు. గిరిశిఖర గ్రామాలకు చెందిన గర్భిణులను ముందస్తుగానే వసతిగృహాల్లో చేర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఐవో ఎం.నారాయణ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

వసతి గృహాల్లో సమస్యలపై దృష్టి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలపై దృష్టిసారించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల చాలా వరకు వసతిగృహాల్లో పరిస్థితి మెరుగుపడిందన్నారు. అయితే ఇంకొన్ని చోట్ల సమస్యలున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు ప్రత్యేకాధికారులు చొరవ తీసుకుని.. ఆయా వసతిగృహాల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పారిశుధ్యం నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు.



సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

సంజీవయ్య స్ఫూర్తితో..

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సంజీవయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సంజీవయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎస్.కృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులు వేగవంతం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ

కొమరాడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 'పల్లె పండుగ' పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షించారు. పీఎం సూర్యఘర్ యోజన పథకంపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. పీఎం జన్‌మన్ కింద చేపట్టే గృహ నిర్మాణాల్లో మరింత పురోగతి కనిపించాలన్నారు. ఎప్పటికప్పుడు సమావేశాలను ఏర్పాటు చేసుకుని చురుగ్గా పనులు సాగేలా చూడాలని ఆదేశించారు. ఇందులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కంబవలస-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ప్రీ స్కూల్ నిర్వహణ, పిల్లల హాజరు, వారి వయసుకు తగిన బరువు, ఎత్తు పరిశీలించారు. మెనూ, అమలు పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి, ఎంపీడీవో మల్లికార్జున రావు, మండల ప్రత్యేకాధికారి ఎ.రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టికల్ 275 (1) పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఆదేశించారు. గిరిజన సంక్షేమ అధికారులతో ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్ గ్రామాల్లో తాగునీరు, రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్, గృహ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. గోకులం షెడ్లు, బజార్లు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఈ మణిరాజు, డీఈఈలు, ఏఈఈ తదితరుల పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

బాల్యాన్ని చిదిమేస్తున్న క్యాన్సర్



బొబ్బిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి)

- పిల్లల్లో పెరుగుతున్న బాధితులు
- తొలిదశలో గుర్తిస్తే నివారణకు అవకాశం
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో వైద్యం

నేడు ఇంటర్నేషనల్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే

క్యాన్సర్.. ఈ పేరు వింటేనే హడలిపోతాం. మన చుట్టూ ఉన్న వారిలో ఎవరికైనా క్యాన్సర్ సోకిందని తెలిస్తేనే బాధ పడిపోతాం. ఇక చిన్నపిల్లలకైతే ఆ ఆవేదన చెప్పనలవి కాదు. ఇటీవల కాలంలో చిన్న పిల్లల్లోనూ క్యాన్సర్ లక్షణాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. బాలల నవ్వులను మొగ్గలోనే తుంచేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా క్యాన్సర్ బారిన పడుతున్న పిల్లల సంఖ్య పెరుగుతూ వస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. మన దేశంలో ఏటా సుమారు 75,000 మంది బాలలు కొత్తగా క్యాన్సర్ బారిన పడుతున్నట్టు సమాచారం. ఉమ్మడి విజయ నగరం జిల్లాకు సంబంధించి ఎంతమంది ఈ వ్యాధి బారిన పడుతున్నారనేది అధికారికంగా వైద్యులు చెప్పలేకపోతున్నారు. ఎక్కువ మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తుండడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ఏటా ఫిబ్రవరి 15న అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినాన్ని నిర్వహిస్తున్నారు. 2002 నుంచి ప్రపంచవ్యాప్తంగా దీనిపై దృష్టి సారించి ప్రజల్లో విస్తృత అవగాహన, ప్రచారం కల్పిస్తున్నారు.

● పిల్లల్లో క్యాన్సర్ రకాలు..

దేశంలో 0 - 14 ఏళ్ల వయసు గల పిల్లలలో వచ్చే క్యాన్సర్ ప్రధానంగా మూడు రకాలుగా ఉంటుంది. అధికశాతం పిల్లల్లో లుకేమియా (బ్లడ్ కేన్సర్), బ్రెయిన్ ట్యూమర్స్, లింఫోమాస్ కనిపిస్తాయి.

● ఇవీ లక్షణాలు..

తీవ్ర జ్వరం రావడం, రెండు వారాలైనా తగ్గకపోవడం, అకారణంగా బరువు తగ్గడం, తీవ్ర అలసట, తరచుగా ఇన్‌ఫెక్షన్‌లకు గురవ్వడం, కంట్లో తెల్లమచ్చలు, నడకలో మార్పు రావడం, మాటలు తడబడడం, తరచుగా తలనొప్పి, వాంతులు, రక్తహీనత, పొట్ట, దవడలు, చేతులు, కాళ్లు, గజ్జల్లో వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

● కారణాలు..

అధిక బరువు కలిగి ఉండడం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, తరచుగా రోగాల బారిన పడుతుండడం క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం, రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉండడం, తల్లి గర్భం దాల్చిన సమయంలో ఆల్కహాల్, స్మోకింగ్, మందులు అధికంగా వాడడం, జన్యుపరమైన కారణాలు పిల్లల్లో క్యాన్సర్‌కు దారితీస్తాయి.

● అవగాహన, రక్షణ లక్ష్యంగా..

పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం... అవసరమైన సాయం... చికిత్సను అందజేయడం ద్వారా పిల్లల జీవితాలను రక్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పరిశోధన, నూతన చికిత్సా విధానాలు, చికిత్సల కోసం నిధుల సేకరణ వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. వలంటీరుగా సేవలందించడం, తల్లిదండ్రులకు భరోసాగా నిలబడడం, బాల్య క్యాన్సర్‌పై పరిశోధనకు న్యాయవాదిని నియమించడం, క్యాన్సర్‌ను జయించిన వారి వివరాలను పెద్దఎత్తున ప్రచారం చేయడం వంటి వాటిపై దృష్టి పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● ఈ పరీక్షలతో...

లుకేమియాకు సంబంధించి పిల్లలకు మొదట సీబీసీ అనే రక్తపరీక్ష చేస్తారు. ఇందులో తెల్లరక్త కణాల పెరుగుదల, ప్లేట్‌లెట్స్ తగ్గడం, రక్తహీనతను గమనిస్తే వారికి బోన్‌మారో పరీక్ష నిర్వహిస్తారు. వీటి ద్వారా పిల్లల్లో బ్లడ్ కేన్సర్ (లుకేమియా) ఉందో లేదోనని నిర్ధారణ చేస్తారు. బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించి సీటీ స్కాన్ లేదా ఎంఆర్‌ఐ స్కాన్ పరీక్ష ద్వారా, లింఫోమాస్‌ను బయాప్సీ, పెట్‌స్కాన్ ద్వారా నిర్ధారిస్తారు.

● చికిత్సా విధానాలు..

ప్రస్తుతం పిల్లలకు వచ్చే క్యాన్సర్‌లో లుకేమియాకు సంబంధించి కీమోథెరపీ చికిత్స, లింఫోమా, బ్రెయిన్ ట్యూమర్‌లకు సంబంధించి శస్త్రచికిత్స, రేడి యేషన్, కీమోథెరపీ చికిత్సలను అందిస్తారు. పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌ను చాలావరకు నివారించ వచ్చు. తొలి దశలో గుర్తించడం... పూర్తిస్థాయి చికిత్సను అందించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. బాల్యంలో తగ్గినప్పటికీ మరో 10 లేదా 20 ఏళ్ల తరువాత క్యాన్సర్ లక్షణాలు కనిపించే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

● నివారణ మార్గాలు..

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఆహారంలో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. అధిక బరువు లేకుండా వ్యాయామం చేయడం, దుమ్ము, ధూళి నుంచి రక్షణ, వ్యాక్సిన్లు రెగ్యులర్‌గా వేసుకోవడం వంటి మార్గాల ద్వారా కొంతవరకు పిల్లలకు క్యాన్సర్ సోకకుండా నిరోధించవచ్చు.

క్యాన్సర్‌ను జయించడం మన చేతుల్లోనే ఉంది..



కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చు. పుట్టిన బిడ్డలకు ఆరునెలలకు పైగా తల్లిపాలను అందించడం చాలా అవసరం. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పసిపిల్లలు మారాం చేస్తున్నారన్న నెపంతో వారికి మొబైల్ ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అందజేస్తుండడం అనారోగ్యానికి హేతువు అవుతోంది. రేడియేషన్ ప్రభావం పిల్లల ఆరోగ్యంపై పడుతోంది. ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తిస్తే కచ్చితంగా నివారించవచ్చు. ముందుగా భయాన్ని వీడాలి. రోగ పీడితులను మనస్ఫూర్తిగా సాకి... ఆత్మస్థైర్యం కల్పించాలి. పూర్తి స్థాయిలో మందులు వాడితే నివారణ సాధ్యమే. జన్యుపరమైన, పర్యావరణం, ఇన్‌ఫెక్షన్, ఆహారపు అలవాట్లు కేన్సర్ కారకాలుగా మారాయి. ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలి. క్యాన్సర్ మందుల తయారీ కోసం పరిశోధనలను ముమ్మరం చేయాలి. ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. తొమ్మిదేళ్ల వయస్సు దాటిన ప్రతి చిన్నారికీ వ్యాక్సిన్ వేయించాలి. క్యాన్సర్‌ను జయించిన వారి వివరాలను బాగా ప్రచారం చేయాలి. జిల్లా కేంద్ర ఆసుపత్రులలో క్యాన్సర్‌కు అత్యుత్తమ సేవలు అందుతున్నాయి.

-డాక్టర్ హరిప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, బొబ్బిలి

ఇంటికే పౌష్టికాహారం..

ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు క్యాన్సర్ సోకినట్లు సమాచారం ఉంటే ఆ తల్లిదండ్రులకు గట్టిభరోసా కల్పిస్తాం. వారికి అవగాహన కల్పించి మెరుగైన వైద్యసేవలకు సంబంధించి తగిన సమాచారాన్ని అందజేస్తాం. వారికి కౌన్సిలింగ్ చేస్తాం. క్యాన్సర్ సోకిన పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేకపోతే వారి ఇళ్లకే పౌష్టికాహారాన్ని అందజేస్తాం.

-జె.విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీవో, బొబ్బిలి



పొలాల్లో ఉన్న ఏనుగులు

ధాన్యం, బియ్యం నిల్వల ధ్వంసం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా గరుగుబిల్లి మండలంలోనే సంచరించిన గజరాజులు శుక్రవారం జియ్యమ్మవలస మండలం బాసంగికి చేరుకున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు హడలెత్తిపోతున్నారు. గురువారం రాత్రి అవి నాగూరులో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రైస్ మిల్లులో ధాన్యం, బియ్యం నిల్వలను ధ్వంసం చేశాయి. ఆ తర్వాత అక్కడి నుంచి జియ్యమ్మవలస మండలం వైపు పయనించాయి. ప్రస్తుతం బాసంగిలో ఏనుగులు సంచరిస్తుండడంతో ఆ గ్రామస్థులు, రైతులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ శాఖాధికారులు స్పందించి గజరాజులను తరలించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఏనుగుల కదలికలను పది మంది ఫారెస్ట్ సిబ్బంది ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

అధికారుల మధ్య సమన్వయం అవసరం

- అందరి సహకారంతో అమ్మవారి జాతర
- ఆర్డీవో సత్యవాణి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్డీవో తదితరులు

చీపురుపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆర్డీఓ జీవీ సత్యవాణి కోరారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన వివిధ శాఖల సయన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే జాతర సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి పెట్టాలన్నారు. తోపులాటలు, అల్లర్లకు తావు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. తాగునీరు, వైద్య సాయం వంటి విషయాల్లో పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆలయం వద్ద ఎటువంటి గందరగోళానికి తావు లేకుండా చూడాలన్నారు. వీఐపీ దర్శన సమయంలో ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని పోలీసులు, దేవదాయ శాఖాధికారులు, కమిటీ ప్రతినిధులు తగిన ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు. ఈ సందర్భంగా అమ్మవారి జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ జి.శంకరరావు, ఎస్‌ఐ ఎల్.దామోదరరావు, తహసీల్దారు ఎన్.రాజారావు, ఆలయ ఈఓ బి.శ్రీనివాస్, ఎంపీపీ ఏఓ ప్రవీణ్, తెలుగుదేశం నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శంకరరావు, బీజేపీ అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న న్యాయాధికారి శారదాంబ

రాజాం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని కోర్టు సముదాయ ప్రాంగణంలో మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ పిలుపునిచ్చారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పలు శాఖల అధికారులతో శుక్ర వారం ఆమె సమావేశమయ్యారు. న్యాయ వాదులు, పోలీసులు, బ్యాంకర్లు లోక్ అదాలత్ విజయ వంతానికి కృషి చేయాలన్నారు. అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారం చేసుకుంటే కోర్టు ఫీజు కక్షిదారులకు వాపస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ మాట్లాడారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామినాయుడు, ఉపాధ్యక్షుడు జయదేవ్, ఏజీపీ పోలారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

గుండెకు అభయం



- గుండెపోటుకు ఉచితంగా ఖరీదైన ఇంజక్షన్లు
- ప్రభుత్వాస్పత్రులకు సరఫరా
- బాధితులకు మేలు

● రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో నివాసముంటున్న అప్పా రావు అనే వృద్ధుడికి ఏడాది కిందట గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసరంగా రూ.45 వేల విలువ చేసే టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ ఇవ్వడంతో కోలుకున్నాడు. తరువాత విశాఖ తరలించి.. చికిత్స అందించడంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది.

● వెంకటరమణ అనే వ్యక్తి గుండెపోటు లక్షణాలకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఈసీజీ తీయగా గుండెపోటు అని తేలింది. వెంటనే రూ.45 వేలు విలువచేసే టెనెక్టెప్లేస్ అనే ఇంజక్షన్ వేయడంతో ప్రాణాపాయం తప్పింది. అక్కడి నుంచి విశాఖ తరలించి బైపాస్ సర్జరీ చేశారు.

● గత ఏడాది డిసెంబరులో రాజాం పట్టణంలోని వస్త్రపురి కాలనీకి చెందిన విశ్వనాథం ఉన్నపళంగా ఇంట్లో పడిపోయాడు. క్షణాల్లో రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైద్యసిబ్బంది ఈసీజీ తీసి గుండెకు సంబంధించిన సమస్యగా గుర్తించారు. క్షణాల్లో రూ.45 వేల విలువచేసే టెనెక్టెప్లేస్ (టిఎన్‌కె-టిపిఏ) ఇంజక్షన్ చేశారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

● రాజాం పట్టణానికి చెందిన చిప్పాడ మధుసూధనరావు, నరవ మోహనరావు, తెర్లాం మండలం చీకటిపేటకు చెందిన ఈర్ల ఎరకయ్య, సంతకవిటి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పూటు పారయ్యలదీ ఇదే పరిస్థితి. గుండెపోటుకు సంబంధించిన లక్షణాలతో రాజాం సామాజిక ఆసుపత్రిలో చేరి కూటమి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన ఇంజక్షన్‌తో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

రాజాం రూరల్/రాజాం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి)

కొవిడ్ తరువాత చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అధికశాతం గుండెపోటుకు గురవుతున్నారు. గుండెపోటు వచ్చిన వారిని రక్షించడం, చికిత్స అందించడంలో తొలిగంటే కీలకమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన వ్యక్తిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి రక్షించేందుకు వీలుగా జిల్లా కేంద్రంతో పాటు ఏరియా ఆసుపత్రుల్లో టెనెక్టెప్లెస్ ఇంజక్షన్లను అందుబాటులో ఉంచింది. గుండెపోటుకు గురైన వ్యక్తికి సంబంధించి రక్తం సరఫరా చేసే నాళాలు గడ్డ కడతాయి. దానిని నియంత్రించేందుకు ఈ ఇంజక్షన్లు ఎంతగానో దోహదపడతాయి. గుండెపోటుకు గురైన గంట వ్యవధిలో వీటిని అందించాల్సి ఉంటుంది. అలా ఇంజక్షన్లు అందక చాలామంది మృత్యువాత పడుతుంటారు. గుండె పోటు లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తరలించాలి. ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి... గుండెపోటు లక్షణాలున్నట్టు వైద్యులు నిర్ధారణకు వస్తే రూ.45 వేల విలువ చేసే టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందించి ప్రాణాపాయం నుంచి కాపాడుతారు. ఆపై మెరుగైన వైద్య సేవల కోసం రిఫర్ చేస్తారు. ఎన్.టి.ఆర్. ఆరోగ్యసేవలో వైద్యసేవలు ఉచితంగా అందజేస్తారు.



రాజాం సామాజిక ఆస్పత్రిలో ప్రత్యేక విభాగాన్ని చూపిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ హరిబాబు

● ఇవీ లక్షణాలు..

ఛాతి నొప్పిగా అనిపించడం, ఎడమ భుజం లాగడం, ఉన్నపళంగా ఆయాసం రావడం, గుండె వేగంగా కొట్టుకోవడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే గుండెపోటుగా గుర్తించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక చికిత్స కోసం ప్రయత్నాలు ప్రారంభించాలి.

● ప్రచార లోపం..

స్టెమీ సేవలను 2023లోనే రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చినా ప్రచారం లేకపోవడం, గత ప్రభుత్వం ఈ సేవలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఎవరికీ తెలియని పరిస్థితి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద గుండెకు భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో ఈ పథకానికి విస్తృత ప్రచారం కల్పిస్తోంది. గ్రామీణులకు సైతం అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఒకవ్యక్తికి గుండెపోటు అని వైద్యులు నిర్ధారిస్తే రోగి బరువును బట్టి తగిన మోతాదులో ఇంజక్షన్ ఇస్తారు.

● ఆస్పత్రుల వారీగా ఇలా..

జిల్లా వ్యాప్తంగా 120 ఇంజక్షన్ల వరకూ ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. శృంగవరపుకోట ప్రాంతీయ ఆస్పత్రిలో 19, చీపురుపల్లిలో 14, గజపతినగరం ఆస్పత్రిలో 18 ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఇక సామాజిక ఆస్పత్రులకు సంబంధించి బొబ్బిలిలో 21, బాడంగిలో 15, రాజాం ఆస్పత్రిలో 7, భోగాపురంలో ఒక ఇంజక్షన్ అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న సామాజిక, ప్రాంతీయ, జిల్లా కేంద్ర ఆస్పత్రులకు 120 వరకూ ఇంజక్షన్లు అందిస్తే.. ఇప్పటికే 75 వరకూ వినియోగించినట్టు సమాచారం. అంటే 75 మంది వరకూ ప్రాణాలు నిలిపారన్న మాట. విజయనగరం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి అవసరం మేరకు అన్ని ఆస్పత్రులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● వైద్య సేవలకు ఏర్పాట్లు

గుండెపోటు లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన వారికి క్షణాల్లో వైద్యసేవలు అందించేందుకు వీలుగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేశాం. అందులోనే ఈసీజీ వంటి అధునాతన పరికరాలను పెట్టాం. అవసరమైన ఇంజక్షన్లు సైతం అత్యవసర విభాగంలో ఫ్రిజ్‌లో ఉంచాం. ఇప్పటి వరకూ అయిదుగురిని ప్రాణాపాయం నుంచి కాపాడాం.

-డా.కరణం హరిబాబు, సూపరింటెండెంట్, సామాజిక ఆసుపత్రి, రాజాం

● వెంటనే సంప్రదించండి

గుండెపోటుకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి. కొంతమంది గ్యాస్ట్రిక్ అని నిర్లక్ష్యం చేస్తుంటారు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దు. ఏమాత్రం అలసత్వం వహించినా ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

-డా.రాజ్యలక్ష్మి, ఆసుపత్రి సేవల కో ఆర్డినేటర్, విజయనగరం

గృహ నిర్మాణాలు వేగవంతం

- కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశం
- కురుపాం మండలంలో పర్యటన

కురుపాం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద చేడుతున్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇంజనీర్లను హెచ్చరించారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం నేరడువలస, మంత్రజోల, దుర్బిలి, కురుపాం గ్రామాలలో కలెక్టర్ పర్యటించారు. నేరడువలసలో పీఎం జన్‌మన్ కింద నిర్మించిన గృహాలను పరిశీలించారు. 29 గృహాలకు 14 గృహాలు మాత్రమే పనులు ప్రారంభం కావడంపై ఆరా తీశారు. మిగిలిన గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని, అలసత్వం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గృహ నిర్మాణాల వల్ల వలసలు వెళ్లకుండా గ్రామంలోనే పనులు లభిస్తాయని.. కూలీలకు, మేస్త్రీలకు ఇదొక సదవకాశమని కలెక్టర్ వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి కార్యకర్త పి.సుశీల పనితీరును ప్రశంసించారు.



నేరడువలసలో పునాదులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



దుర్బిలిలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జీడిసాగుపై ఆసక్తి చూపాలి..

జిల్లాలో జీడి పంట సాగు చేసేందుకు అనుకూలమని, దీంతో రైతులకు రెట్టింపు ఆదాయం లభిస్తుందని కలెక్టర్ అన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైతే జీడి మొక్క అంటు కట్టడంపై ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. దళారుల మాటలు విని మోసపోకుండా వన్ ధన్ వికాస కేంద్రాల ద్వారా విక్రయాలు చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు. అనంతర మంత్రజోల గ్రామంలో చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. దుర్బిలి గ్రామంలో యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లైబ్రరీని పరిశీలించారు. స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, స్టాఫ్ సెలెక్షన్‌వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న 42 మంది ఆదివాసీ విద్యార్థులతో మాట్లాడి.. సూచనలు చేశారు.

సూర్యఘర్ యోజన పరిశీలన..

కురుపాంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద లబ్ధిదారుడు పొట్నూరు మధుసూదనరావు ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్‌ను కలెక్టర్ పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మంతినివలస గ్రామంలో పీఎం జన్‌మన్ కింద నిర్మించిన గృహాలను పరిశీలించారు. గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరి, తహసీల్దార్ రమణమ్మ, వెలుగు ఏపీఎం బి.వెంకటరావు, ఏపీవో పి.బావాజీ, హౌసింగ్ ఏఈ అచ్చమ్మ, ఎస్ఐ నారాయణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలగానే నాలుగులేన్ల రోడ్డు

● గతంలోనే విస్తరణకు ప్రతిపాదనలు ● ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆశలు

చీపురుపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నుంచి పాలకొండ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కలగా మిగిలిపోయింది. విజయనగరం నుంచి చీపురుపల్లి, రాజాం, పాలకొండ వరకూ 72 కిలో మీటర్ల పొడవైన ఈ రహదారిని గతంలో విస్తరించాలని ప్రతిపాదించారు. దీని కోసం అప్పట్లో సర్వే చేశారు. ఈ రోడ్డు ఐదు అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం నాలుగు జిల్లాలను కలుపుతోంది. ఇటు ఆంధ్ర నుంచి ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు ప్రయాణానికి, నిత్యావసర సరుకుల రవాణాకు ఈ రోడ్డే ప్రధానమైనది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డును విస్తరించాలని కొన్నేళ్లుగా డిమాండ్ ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు విస్తరణతో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పలు పట్టణాల్లోని ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్న కూటమి ప్రభుత్వం ఈ ప్రధాన రహదారి విస్తరణపై దృష్టి పెట్టాలన్న అభిప్రాయం అందరి నుంచి వ్యక్తమవుతోంది. రామభద్రపురం నుంచి రాజాం వెళ్లే మార్గాన్ని విస్తరించాలన్న ప్రతిపాదనపై ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇటీవల మాట్లాడిన నేపథ్యంలో విజయనగరం-పాలకొండ రోడ్డు విస్తరణ ప్రతిపాదనకు కూడా కదలిక వస్తుందని అందరూ భావిస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణపై ఎంపీ కలిశెట్టి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.


విస్తరణకు ప్రతిపాదించిన విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారి ఇదే..


సమస్యలను వివరిస్తున్న బంగార్రాజు

సీఎంను కలిసిన కర్రోతు

భోగాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిపై స్పందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుకు సూచించారు. గురువారం రాత్రి సీఎం క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబును బంగార్రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి, కార్యకర్తల సమస్యలను వివరించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 7న ప్రారంభమయ్యిందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు మార్చి 6 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

వంగర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దారు ధర్మారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు వంగరలో పోలింగ్ కేంద్రం ఏర్పాట చేశామన్నారు. 61 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్, బైక్ ఢీ: తప్పిన ప్రమాదం

రేగిడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరాడ సెంటర్‌లో శుక్రవారం ఇసుక ట్రాక్టర్, బైక్ ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ప్రాణహాని లేకపోవటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ట్రాక్టర్ కిందకు బైక్ వెళ్లడంతో బైక్ పూర్తిగా పాడైంది. బైక్ నడుపుతున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అతడు ఇదే మండలంలోని పోరాం గ్రామానికి చెందినవాడు.

బోర్డులు ఏర్పాటు చేయండి

భోగాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు అధికారులను కోరారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లకు వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు బి.శ్రీనివాసరావు, గౌరినాయుడు, నజీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యాకిట్ల పంపిణీ

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామం దబ్బగుంటలోని 25 మంది విద్యార్థులకు శుక్రవారం కిజీయా ఫౌండేషన్ విద్యా కిట్లను పంపిణీ చేసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జోసెఫ్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నాయుడు, ప్రవీణ్, ప్రకాశ్, జయప్రకాశ్, షీలా, సూర్యప్రకాశ్, శ్యామ్, పాల్, రంజిత్, సైమన్ ఉన్నారు.

మరిడిమాంబ జాతర ప్రారంభం



లక్కవరపుకోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరాయపురంలో మరిడిమాంబ జాతర శుక్రవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని జాతరను ప్రారంభించారు. జాతరలో భాగంగా వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాలనలో వైసీపీ నేతల అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో గజపతి నగ రం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చే పట్టిన ఎనిమిది నెలల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. జగన్ నిరంకుశ పాలనతో రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. చంద్రబాబు 2047 విజన్‌తో ముందుకు వెళుతున్నామన్నారు. దేశంలోనే బెస్ట్ ముఖ్యమంత్రిగా నాలుగో స్థానం చంద్రబాబుకు దక్కడం ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, శీరంరెడ్డి రామ్‌కుమార్, ప్రదీప్, లెంక బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తవలస, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం మండలంలోని వివిద పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు శుక్రవారం తహసీల్దారు బి.సీ లకంఠారావుకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పెండింగ్ బిల్లులు, వేతనాలను సక్రమంగా చెల్లించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు అరికట్టాలని, మెనూ చార్జీలను పెంచాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రతినిధి డేగల అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠోత్సవం


వేదమంత్రాలను పఠిస్తున్న పండితులు

కొత్తవలస, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగపురంలో ఉమా రామలింగేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. వేదపండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ, కొల్లూరు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పండితులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

గుర్రపు డెక్క తొలగిస్తాం

వంగర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్‌లో గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని మడ్డువలస ఎస్ఈ కృష్ణారావు అన్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'తో 'గుర్రపు డెక్కతో చిక్కులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ అంబేడ్కర్ స్పందించరన్నారు. గుర్రపు డెక్క ఆధునిక బోట్ల ద్వారా తొలగించటానికి అంచనాలు తయారు చేశామన్నారు. నిధులు వచ్చిన వెంటనే గుర్రపు డెక్క తొలగిస్తామన్నారు.

నేడు ఎల్.కోటలో ప్రజాదర్బార్

లక్కవరపుకోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలోని నివాసంలో శనివారం ఉదయం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు.శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నియోజవకర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకోవచ్చన్నారు.

రక్తదానంతో నిరసన


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గరివిడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని పశువైద్య కళాశాల విద్యార్థులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరు తూ శుక్రవారం వినూత్నంగా నిరసన తెలి పారు. కళాశాల ప్రాంగణంలో దీక్షా శిబిరంలో 36మంది విద్యార్థులు రక్తదానం చేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా సమస్యలపై అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

పైప్‌లైన్ పనులను అడ్డుకున్న రైతులు

●న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

మెంటాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని కుంటినవలస జిరాయితీ భూముల్లో నుంచి గిరిజనవర్సిటీకి నీటి సరఫరా పైప్‌లైన్ వేయడంపై కొద్దిరోజులు గా అభ్యంతరం వ్యక్తం చేస్తున్న రైతులు పోరా టాన్ని ఉధృతం చేశారు. తమ భూముల్లో నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే అంగీకరించేది లేదని శుక్రవారం ఆ పనులను అడ్డుకున్నారు. ఇది అధికారవర్గాల్లో కలకలం రేపింది. ఈనేపథ్యంలో బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు అక్కడకు వెళ్లి రైతులతో చర్చించారు. అభివృద్ధి పను లను అడ్డుకోరాదని కోరారు. దీనిపై స్పందించిన రైతులు.. ఎందుకు పనులు అడ్డుకుంటున్నామో వివరించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. వర్సి టీ ప్రారంభమయ్యాక తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతోనే పూర్వీకుల ద్వారా సంక్రమించిన భూములను ప్రభుత్వానికి ఇచ్చామని గుర్తు చేశారు. అయితే ఇస్తామన్న పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు మిగిలిన కొద్దిపాటి భూముల మధ్య నుంచి పైపులైన్ వేస్తే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో రామ్మోహనరావు కాంట్రాక్టరుతో మాట్లాడారు. పొలం గట్లను ఆనుకుని సాగుకు ఆటంకం కలగని విధంగా భూమిలో పైప్‌లైన్ వేయిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు రైతులు సమ్మతించడంతో వివాదం సద్దుమణిగింది. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, సర్పంచ్ రమేశ్‌నాయుడు తదితరులున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎక్స్‌పోలో మాట్లాడుతున్న పవన్ గుప్తా

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ రుణాలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలనీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పవన్ గుప్తా అన్నారు. శుక్రవారం నగరంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎంఎస్ఎంఈ లోన్ ఎక్స్‌పో -2025ను ఆయన ప్రారంభించారు. వ్యాపారాల అభివృద్ధికి తమ బ్యాంకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, బాలాజీ మార్కెట్ ప్రతినిధి వెంకటరావు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధి అరుణ్‌కుమార్, బ్రాంచ్ హెడ్ అరుణ్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంజీవయ్య ఆదర్శప్రాయుడు


చిత్రపటం ఎదుట నివాళి అర్పిస్తున్న జేసీ

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడని జేసీ సేతు మాధవన్ కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవయ్య జాతికి చేసిన సేవలు అయన కొనియడారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామానందం తదితరులున్నారు.


చిత్రపటానికి పూలమాల వేస్తున్న జైభీమ్ ప్రతినిధులు

●గరివిడి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి డాక్టర్ దామోదరం సంజీవయ్య జయంతిని గరివిడిలో శుక్రవారం నిర్వహించారు. జైభీమ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు ఉమ్మడి రాష్ట్రానికి సంజీవయ్య చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో జైభీమ్ ప్రతినిధులు బసవ సూర్యనారాయణ, జి.లక్ష్మణ, ఆర్.రామకృష్ణ, డి.అప్పన్న, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

నిధుల కల్పనపై సమావేశం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎక్స్‌ట్రామ్యూరల్, ఆర్‌అండ్‌డీ, ఇంటర్న్‌షిప్‌లకు నిధుల కల్పనపై చర్చించారు. సమావేశంలో ఏఐసీటీఈ నిపుణుడు డాక్టర్ దండు రాధాప్రసాద్ రాజు, ప్రిన్సిపాల్ ఆర్.రమేశ్, ఆర్‌అండ్‌డీ కో-ఆర్డినేటర్ శివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పెదచామలాపల్లిలో రూ.50 లక్షల దుర్వినియోగం

●నిరూపణకు సిద్ధమని ప్రకటించిన వార్డు సభ్యులు, గ్రామపెద్దలు


పత్రికల్లో వచ్చిన కథనాలను చూపిస్తున్న వార్డు సభ్యులు, స్థానికులు

మెంటాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదచామలాపల్లి పంచాయతీలో 15 ఏళ్లుగా సుమారు రూ.50 లక్షలు పక్కదారి పట్టాయని ఇద్దరు వార్డు సభ్యులు, గ్రామపెద్దలు అన్నారు. నిధుల దుర్వినియోగం జరిగినట్టు తాము నిరూపణ చేస్తామన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుత సర్పంచ్ బాయి తవుడమ్మ నాలుగేళ్లలో రూ.1.89 లక్షలు అవినీతి పాల్పడ్డారని గురువారం ఆమె చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శుక్రవారం పెదచామలాపల్లి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వార్డు సభ్యులు సుంకరి లక్ష్మి, జరజాపు అప్పలస్వామితో పాటు స్థానిక పెద్దలు మాట్లాడారు. ఇరవై ఏళ్లుగా బాయి కుటుంబమే సర్పంచ్ పదవిలో కొనసాగుతోందన్నారు. దొంగ బిల్లులు సృష్టించి బినామీల పేరిట పంచాయతీ నిధులు డ్రా చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఇవన్నీ వదిలేసి రూ.1.89 లక్షలు అవినీతి జరిగిందని అధికారులు లెక్క తేల్చడంపై వారు అభ్యంతరం తెలిపారు. అధికారులు విచారణ జరిపితే ఆధారాలతో నిరూపిస్తామని వారు వెల్లడించారు. సమావేశంలో బాయి పెదవెంకటరావు, బాయి భాస్కరరావు, గౌరినాయుడు, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పాస్ చేయిస్తానని మోసం

●రూ. 12 లక్షలు వసూలు ●చీటింగ్ కేసు నమోదు

క్రైం న్యూస్

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యూనివర్శిటీలో తనకు తెలిసిన వారు ఉన్నారు.. అన్ని సబ్జెక్టులను పాస్ చేయిస్తానని.. సుమారు రూ.12లక్షలు తీసుకుని మోసం చేశాడో యువకుడు. దీనిపై 2024 జులై 13న బొబ్బిలి పోలీస్ స్టేషన్‌లో ఓ యువకుడిపై కేసు నమోదయింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి వెలమవారి వీధికి చెందిన చింతల జయప్రకాశ్‌నాయుడు రాజాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇటీవల బీటెక్ పూర్తి చేశాడు. కానీ ఫైనలియర్ పాస్ కాలేదు. ఈక్రమంలో ఇదే కళాశాలలో బీటెక్ పూర్తిచేసి, రిలీవ్ అయిన సూపర్ సీనియర్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన చైతన్యకుమార్.. జయప్రకాశ్‌ను పాస్ చేయిస్తానని నమ్మబలికాడు. తనకు డబ్బులు ఇస్తే ఫెయిల్ అయిన 13 సబ్జెక్టులను యూనివర్శిటీలో మేనేజ్ చేసి పాస్ చేయిస్తానని చెప్పాడు. దీనికి జయప్రకాశ్ అంగీకరించాడు. తండ్రి అకౌంట్ నుంచి దఫదఫాలుగా చైతన్యకుమార్‌కు రూ.12 లక్షలు ముట్టజెప్పారు. కానీ జయప్రకాశ్ పాస్ కాలేదు. దీంతో తాను మోసపోయానని భావించిన జయప్రకాశ్ తన తండ్రి చంద్రమౌళీశ్వరరావుతో కలిసి బొబ్బిలి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు సీఐ కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. బొత్స చైతన్యకుమార్‌ను రిమాండ్‌కు తరలించారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

భోగాపురం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోరి తూడెం పంచాయతీ బసవపాలెంకు చెందిన బుత్తుల రమేశ్‌ను పోక్సో కేసులో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపించారని స్థానిక పోలీసులు తెలిపారు. కుమార్తెను మోసగించడంటూ బాలిక తండ్రి ఈ నెల 5న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదైందన్నారు.

గంజాయిని తరలిస్తున్న వ్యక్తి..

గంట్యాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గింజేరు సమీపంలో గంజాయిని తరలిస్తున్న బొండపల్లి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కె.చంద్రరావును శుక్రవారం గంట్యాడ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 1500 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

దాడి కేసులో ఒకరు..

జామి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ గ్రామంలో మూడు రోజుల కిందట పెసర పంటను కాపాల కాస్తున్న రైతుపై దాడికి పాల్పడిన సింగంపల్లి ఎర్నాయుడును గొడుకొమ్ము జంక్షన్‌లో శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు. న్యాయాధికారి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న మండలంలోని కాళంరాజపేట గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి సీతారాములును శుక్రవారం అదుపులోకి తీసుకుని అతడి నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

అనారోగ్యంతో హోం గార్డు మృతి

రేగిడి, ఫిబ్రవరి 14, (ఆంధ్రజ్యోతి): రేగిడి పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మండలంలోని అక్కన్నఅగ్రహారం గ్రామానికి చెందిన హోం గార్డు పొదిలాపు పైడిరాజు (47 శుక్రవారం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. నెల రోజులుగా ఆయన పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నారు. వ్యాధి తీవ్రత పెరగడంతో ఇంటి దగ్గరే తుదిశ్వాస విడిచాడు. మృతుడికి భార్య రమ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పైడిరాజు మృతిపై స్థానిక ఎస్ఐ నీలావతి, సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

అమర జవాన్లకు నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ ఐదేళ్ల కిందట ఉగ్రదాడిలో 40 మంది సైనికులు బలయ్యారని వివరించారు. వారి ఆత్మలకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. జమ్మూ కశ్మీరులో సైనిక బలగాల లక్ష్యంగా ఉగ్రమూకలు నిరంతరం దాడులకు పాల్పడుతుంటారని విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు వీరన్న, కె.వాసుదేవరావు, అప్పలరాజు, లక్ష్మణ్, శివకుమార్, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మస్తర్లలో తేడాలు వద్దు


వేతన గిట్టుబాటుపై మాట్లాడుతున్న పీడీ శారదాదేవి

రేగిడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారుల మస్తర్లలో తేడాలు ఉండకూడదని డ్వామా పీడీ శారదాదేవి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలో బూరాడలో చేపడుతున్న బత్తినవానిచెరువు పనులను ఆమె పరిశీలించారు. మస్తర్లు నిర్దేశిత యాప్‌లో నమోదు చేయటం, పని ప్రదేశంలో సౌకర్యాలు, అంచనా ప్రాప్తికి జరుగుతున్న పని వివరాలపై ఆమె ఆరా తీశారు. అనంతరం వేతనదారులతో ఆమె మాట్లాడారు. రెండు పూటలా కొలతల ప్రాప్తికి పనిచేసి కనీసం వేతనం రూ.300 పొందాలని సూచించారు. ఆమెతో పాటు ఏపీవో హరనాథ్, ఈసీఈ రామినాయుడు ఉన్నారు.

●గరివిడి: మండలంలోని గొట్నంది, బొండపల్లి, చిరుగుడుపేట గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం డ్వామా పీడీ శారదాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మామిడితోటల్లో జరుగుతున్న రింగ్ ట్రెంచ్ పనులు, తోటలో కందకాల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

చిరు వ్యాపారులను ఆదుకోండి


ఆందోళన చేపడుతున్న చిరు వ్యాపారులు

రాజాం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దుకాణాల తొలగింపుతో వీధినపడిన చిరు వ్యాపారులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్.నాగభూషణం మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ రాజాం మున్సిపాలిటీలో శ్రీనివాస రోడ్డులోని చిరు వ్యాపారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దుకాణాలు తొలగించడం తగదన్నారు. "దాంతో 45 కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయన్నారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి బాధ్యత కమిషనర్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కనకరాజు, కృష్ణ, గంగారాం, రాము తదితరులు పాల్గొన్నారు.

సోనూసూద్‌కు మంత్రి కృతజ్ఞతలు

● గిరిజనుల కోసం నాలుగు అంబులెన్స్‌ల అందజేత



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కొఠియా గ్రామాల గిరిజనులు

సాలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సోనూసూద్ గొప్ప నటుడే కాకుండా మనసున్న రియల్ హీరో అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరులోని తన నివాసంలో ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో సమావే శం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. గిరిజనుల కోసం సోనూసూద్ ముఖ్యమంత్రికి నాలుగు అంబులెన్స్‌లు అందించారని చెప్పారు. ఆయనకు అరకు పార్లమెంట్ గిరిజనులందరి తరఫున ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు రెండు, పార్వతీ పురం మన్యం జిల్లాకు రెండు అంబులెన్స్‌లను పంపించారన్నారు. కరోనా సమయంలో వివిధ ప్రదేశాల్లో చిక్కుకున్న వారిని తన సొంత ఖర్చులతో వారివారి స్వగ్రామాలకు పంపిన గొప్ప మనుసున్న హీరో సోనూసూద్ అని ఆమె అన్నారు.

ఒడిశా దూకుడుకు అడ్డుకట్ట వేయాలి

కొఠియా గ్రామాల ప్రజలకు రక్షణ కల్పించి, ఒడిశా ప్రభుత్వం దూకుడుకు అడ్డుకట్ట వేయాలని 21 కొఠియా గ్రామాల ప్రజలు శుక్రవారం మంత్రిని కలిసి, తమ గోడును వినిపించారు. ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యం చేస్తూ వస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గ్రామాలను పట్టించుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.సుందరరావు, టి.శంకరరావు, మర్రి శ్రీనివాసరావు తోపాటు పలువురు కొఠియా గ్రామాల యువకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



వినతిపత్రాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం నర్సిపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరిం చారు. వీఆర్ఎస్ ప్రాజక్టు ద్వారా సీతానగరం మండలంలో కోట సీతారాంపురం, పి.బుచ్చంపేట, జాను, మల్లువలస, గాజులవలస గ్రామాలకు సాగునీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందించారు. సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

రహదారి నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే జగదీశ్వరికి సమస్యను వివరిస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేరువాడ గ్రామం నుంచి వనకాబడి గ్రామానికి రహదారి నిర్మించాలని వనకాబడి పరిసర గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమెను గుమ్మలక్ష్మీపురంలోని తన స్వగృహంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. మారుమూల కొండశిఖర గ్రామాలకు రహదారులు నిర్మించడానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు.

'స్వర్ణాంధ్ర'లో జిల్లాకు 18వ స్థానం

పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విభాగంలో పట్టణ అభివృద్ధి శాఖ పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై అధికారుల ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం అమరావతిలో వెల్లడించారు. మొత్తం 14 ఇండికేటర్స్‌లో పెట్టుకున్న లక్ష్యాలను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, సాలిడ్‌వేస్ట్ సెగ్రేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ సోప్‌పిట్స్, క్లీన్ విలేజ్, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ తదితర కార్యక్రమాల్లో జిల్లాల వారీగా ప్రగతిని పరిశీలించారు. మొత్తం 14 ఇండి కేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంకులను ప్రకటించారు. దీనిలో పార్వతీపురం మన్యం జిల్లా 105 పాయింట్లతో 18వ స్థానం దక్కింది.

నేడు రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని డీఎం దుర్గా దేవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోలకు చెందిన ఉత్తమ డ్రైవర్ల దంపతులను ఆమె సన్మానించారు.

మదుమును ఏర్పాటు చేయాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గౌరీసాగరం చెరువుకు మదుమును ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీడీవో జి.పైడితల్లికి పెదగుడబ గ్రామానికి చెందిన మరడాన తిరుప తిరావు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. పెదగుడబ రెవెన్యూ పరిధిలో గౌరీసాగరం చెరువు కింద సుమారు 30 ఎకరాల పైబడి ఆయకట్టు ఉందని, గతంలో ఉన్న మదుమును ఉపాధి వేతనదారులు కప్పేశారన్నారు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని చెప్పారు. అలాగే గ్రామంలో పండ్ల తోటల్లో ఉపాధి పనులు కల్పించాలని వారు కోరారు. ఈ విషయమై ఎంపీడీవో మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదిక పంపించి పండ్ల తోటల్లో కందకాలు వేసే పనులను కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే మదుమును ఏర్పాటు చేసేందుకు ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో చికెన్ పెట్టవద్దు

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు చికెన్ కూర పెట్టవద్దని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి ఉత్తర్వులు జారీ చేసినట్టు భద్రగిరి బాలుర గురుకుల జూనియర్ కళాశాల ప్రన్సిపాల్ యుగంధర్ తెలిపారు. ఈ ఉత్తర్వులను అమలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

సూర్య ఘర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వినియోగదారులు సూర్య ఘర్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యుత్ శాఖ ఏఈ బడే శ్రీనివాసనాయుడు కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో భాగంగా సోలార్ ప్యానల్‌కు 40 శాతం ప్రభుత్వ రాయితీ ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పేరుకే కళాశాల

● కానరాని సౌకర్యాలు.. అరకొరగా విద్యార్థులు

● తూతూ మంత్రంగా తరగతులు

● ఉన్నత పాఠశాలలోనే నిర్వహణ



కళాశాలను నిర్వహిస్తున్నది ఈ పాఠశాలలోనే..



తరగతి గదిలో నలుగురు విద్యార్థులు ఉన్న దృశ్యం

రామభద్రపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పేరుకే కళాశాల.. కానరాని సౌకర్యాలు.. అరకొర విద్యార్థులు.. ఐదుగురు అధ్యాపకులు.. ఒకే గ్రూపు.. ఉన్నత పాఠశాలలోనే తరగతుల నిర్వహణ.. కనీసం కళాశాల పేరుతో బోర్డు లేని వైనం.. ఇదీ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల దుస్థితి. ఈ కళాశాలలో ఒకే ఒక సీఈసీ గ్రూపు ఉండగా 18 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఆరుగురు విద్యార్థులు దివ్యాంగులు. వీరి కోసం ఐదుగురు అధ్యాపకులను నియమించారు. మొదటల్లో ఎంపీసీ గ్రూపు ఏర్పాటు చేసినా విద్యార్థులు లేకపోవడంతో దానిని రద్దు చేశారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు బోధించాల్సి ఉంది. అయితే పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహించడం లేదు. విద్యార్థులు కూడా పూర్తి స్థాయిలో హాజరు కానట్టు తెలు స్తోంది. ఇక్కడి అధ్యాపకులు కూడా యూపీ పాఠశాల నుంచి డెప్యుటేషన్‌పై వచ్చిన వారే. స్థానిక ఉన్నత పాఠశా లలోని ఒక గదిలో తరగతులు నిర్వ హిస్తున్నారు. ఈ ఏడాది నుండే తరగతులు ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల అనే పేరుతో ఎక్కడా బోర్డు కూడా లేకపోవడం విశేషం. తూతూ మంత్రంగా నడుస్తున్న ఈ కళాశాలలో సౌకర్యా లు లేకపోతే విద్యార్థులు ఎలా చేరుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఈ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు చేశారు. ● దీనిపై ఈ కళాశాలను నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.కామేశ్వరరావును వివరణ కోరగా త్వరలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల కోసం విద్యార్థులు ఇంటి వద్ద అభ్యసిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో పాకలు

● తొలగించేందుకు అధికారుల యత్నం

● అడ్డుకున్న పారిశుధ్య కార్మిక కుటుంబాలు



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మిక కుటుంబాలు

బొబ్బిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పాకీ వీధి (పారిశుధ్య కార్మికుల కాలనీ)లో శుక్రవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ కాలనీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో కాలనీవాసులు సుమారు 34 మంది సర్వేరాళ్లు వేసుకుని పాకలు వేసుకునే పనికి శ్రీకారం చుట్టారు. 1990లో అప్పటి మున్సిపల్ చైర్మన్ ఆరి గంగయ్య ఆధ్వర్యంలో ఈ స్థలాలను తమకు కేటాయించినట్లు వారు అప్పుడు చెల్లించిన రశీదులను చూపుతున్నారు. ఒక్కో పాక నిర్మాణానికి కాంట్రాక్టర్‌తో రూ.10వేలు చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం స్పందించి పోలీసు బలగాలను, ప్రొక్లయినర్‌ను తీసుకొచ్చారు. పాకలను బలవంతంగా తొలగించేం దుకు ఉపక్రమించారు. పారిశుధ్య కార్మిక కుటుంబాల వారంతా వచ్చి తొలగింపును అడ్డుకున్నారు. యంత్రం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. పాకలు తొలగిస్తే ఊరుకునేది లేదని భీష్మించుకున్నారు. దీనితో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వీరికి సీపీఎం నాయకులు గోపాలం, సురేష్ తదితరులు మద్దతుగా నిలిచారు. పట్టణ వ్యాప్తంగా అనేక చోట్ల ఆక్రమణలు ఉన్నాయని, వాటన్నిటినీ తొలగించిన తర్వాత తమ పాకలను తొలగించాలని కార్మికులు డిమాండ్ చేశారు. దీనిపై మున్సిపల్ అధికారులు, సీఐ సతీష్‌కుమార్‌లు చర్చించుకుని అక్కడ ఓ బోర్డు పాతేసి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇది ప్రభుత్వ స్థలమని ఇక్కడ ఆక్రమణ చేసుకుంటే శిక్షార్హులవుతారని హెచ్చరిక బోర్డు పెట్టి వెళ్లిపోయారు. దీంతో ఆందోళనకారులు అక్కడి నుంచి లేచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కిరణ్‌కుమార్, సీఐ సతీష్‌కుమార్, ఆర్వో నాగరాజు, టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, సచివాలయాలకు చెందిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య ప్రమాణాల మెరుగుకు పల్లె నిద్ర

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఆశ్రమ పాఠశాలలో పడుకున్న కలెక్టర్

పార్వతీపురం/ కురుపాం, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు, విద్య ప్రమాణాలు మెరుగు పరిచేందుకు పల్లెనిద్ర కార్యక్రమం ఉపయోగపడుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం రాత్రి కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిద్రించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 97 సంక్షేమ వసతి గృహాల్లో గురువారం రాత్రి జిల్లా స్థాయి అధికారులు నిద్రించి, అక్కడ పరిస్థితులను అధ్యయనం చేశారని చెప్పారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వసతి, ఆహారం మెరుగ్గా ఉంటే విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగాలకు చక్కటి మార్గం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

హామీలు ఏమయ్యాయి?

రామభద్రపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం ఎంతవరకు సమంజసమని జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. కొట్టక్కి గ్రామంలో ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి వైసీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టడం సబబు కాదన్నారు. విద్యార్థులకు తల్లికి వందనం, విదేశీ విద్యాదీవెన, వసతి దీవెన, అన్నదాత సుఖీభవ వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అలాగే నిరుద్యోగ భృతితోపాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని మోసం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైసీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మంనాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ లైన్‌మన్ మృతి

కొమరాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పెదశాఖ గ్రామ సచివాలయ పరిధిలో పని చేస్తున్న విద్యుత్ శాఖ జూనియర్ అస్ట్ లైన్‌మన్ బిడ్డిక శ్రీనివాసరావు (30) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. జాకూరు గ్రామంలో విద్యుత్ శాఖకు సంబంధించిన రీడింగ్ బిల్లుల కోసం వెళ్తుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే కూనేరు-రామభద్రపురం వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్టు సమీప బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్ఈ

పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను ఏపీఎంఐడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయభాస్కర్ శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కలెక్టర్‌ను కలిసినట్టు విజయభాస్కర్ ఈ సందర్భంగా చెప్పారు. ఏపీఎంఐడీసీ ద్వారా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సాలూరు ఏరియా ఆసుపత్రితో పాటు కురుపాం సీహెచ్‌సీ అభివృద్ధి పనులు మార్చి నెలకు పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా సీతంపేటలో జిల్లా కేంద్రం పార్వతీపురం నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఈ చెప్పారు.

వసతి సౌకర్యాలు కల్పించండి

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తమకు వసతి సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల ప్రత్యేకాధికారి కొండలరావుకు వేడుకున్నారు. గురువారం రాత్రి పల్లె నిద్రలో భాగంగా ఆయన పాఠశాలలో రాత్రి బస చేశారు. విద్యార్థులకు తరగతి, వసతి రెండూ ఒకే చోట ఉండటమనే విషయంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 8న వెలువడిన కథనాన్ని హెచ్ఎం వి.ధనుంజయనాయుడు ఆయన వద్ద ప్రస్తావించారు. వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని మండల ప్రత్యేకాధికారి తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామదర్శినిలో భాగంగా ఆయన ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం విషయంపై ఎంపీడీవో శంబంగి రమేష్‌తో చర్చించారు. అనంతరం అంగన్‌వాడీ-3 కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల విద్యా ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్య లోపాన్ని గమనించి, పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీటీ రెడ్డి పకీరు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణాలు రద్దు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు ప్రాంతాల్లో ప్రహరీ నిర్మాణాలను రద్దు చేశారు. మండలానికి సంబంధించి 14 ప్రహరీల నిర్మాణాలకు కలెక్టర్, డ్వామా పీడీలు రూ.1.64 కోట్లు నిధులు మంజూరు చేస్తూ గత నెల 27న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అసంపూర్తి నిర్మాణాలకు ప్రహరీలు మంజూరు చేసిన పరిస్థితి నెలకొంది. గిజబలో శ్లాబ్ పూర్తికాని అంగన్‌వాడీకి ప్రహరీ నిర్మాణానికి రూ.9.30 లక్షలు మంజూరు చేశారు. అసంపూర్తి నిర్మాణాలపై ఈనెల 9న ఆంధ్రజ్యోతిలో 'అసంపూర్తి నిర్మాణాలకు ప్రహరీలు' శీర్షికన కథనం వెలువడింది. ఈ కథనంపై స్పందించిన అధికారులు గిజబతో పాటు తోటపల్లి పంచాయతీ నందివా నివలస-1 అంగన్‌వాడీ కేంద్రానికి, అలాగే సుంకి పంచాయతీ కేఆర్ఎన్ వలసలో ప్రాథమిక పాఠశాలకు సంబంధించి పనులు నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రహరీల నిర్మాణాలకు మంజూరైన రూ.30.90లక్షల నిధులను నిలుపుదల చేశారు.

రేషన్ ఇస్తున్నారోచ్



రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రేషన్ సరుకుల పంపిణీ శుక్రవారం ప్రారంభమయ్యింది. గురువారం ఆంధ్రజ్యోతిలో 'రేషన్ అందలే' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వాస్తవానికి ఇక్కడ 811 రేషన్‌కార్డులకు సరిపోయే 137.50 క్వింటాళ్ల బియ్యాన్ని డీలరు హిమరిక గుంపస్వామి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి విడిపించారు. ఈనెల 4న ఎండీయూ ఆపరేటర్ పండుతో కలిసి బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఆ రోజు 119 కార్డులకు రేషన్, పంచదార అందించారు. తరువాత 681 రేషన్‌కార్డులకు 5వ తేదీన రేషన్ పంపిణీకి సిద్ధపడిన డీలరు తన లాగిన్‌లో రేషన్ జీరో చూపించడం వల్ల పంపిణీ చేయలేకపోయారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డి పకీరుకు తెలియజేశారు. ఆయన జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశారు. సివిల్ సప్లయీస్ కమిషనర్‌కు లెటర్ ద్వారా తెలియజేసినా ప్రయోజనం లేదు. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం రావడంతో జిల్లా అధికారులు స్పందించి సాంకేతిక లోపాన్ని సరిచేసి పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు బాధ్యతగా ఉండాలని నూతన మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వేంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 30 వార్డుల్లో సుడిగాలి పర్యటన చేశారు. అడ్డాపుశీల వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పనులపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ప్రజారోగ్య శాఖాధికారులతో పాటు సచివాలయ అధికారులు, సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. అలాగే పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన 1వ, 2వ సచివాలయాల సెక్రటరీలు, మేస్త్రీలకు మెమోలు జారీ చేశారు. బెలగాం అన్నా క్యాంటీన్‌ను సందర్శించారు. వారంలో ప్రజలకు అందించే మెనూ చాట్‌ను పరిశీలించారు. విధి నిర్వహణలో బాధ్యతగా ఉండకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

'ఆయన ఎస్కార్ట్ వెహికల్ కానిస్టేబుల్'

సాలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తన వద్ద పనిచేస్తున్న ఎస్కార్ట్ వెహికల్ కానిస్టేబుల్ వెంకటరమణ బులెట్ మ్యాగజైన్ పోవటం దురదృష్టకరమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆయన తన గన్‌మన్ కాదని, ఎస్కార్ట్ వెహికల్ కానిస్టేబుల్ అని ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. వయోభారం, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తనకు చెప్పి ఇంటికి వెళ్లారని అన్నారు. విజయనగరంలో ఆయన బ్యాగ్ పోవటం, అందులో ఆయన బుల్లెట్లు ఉండటం బాధాకరమని అన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి: ఎస్పీ



వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన.. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవకాశం ఉన్నంతవరకు పరిష్కరించానని, మిగిలిన సమ స్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. సీసీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే పీసా కమిటీలు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధి కోసమే పీసా కమిటీలు ఏర్పడ్డాయని ఎంపీడీవో కె.గీతాంజలి తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో రెండో రోజు పీసా కమిటీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా పీసా కమిటీల తీర్మానం తప్పనిసరి అని అన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో ఎంపీపీ బి.ఆదినారాయణ, భామిని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.సత్యం, సెక్రటరీ రామకృష్ణ, పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆశీలు పాట మళ్లీ వాయిదా

పాలకొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని 2025-26 ఏడాదికి గాను రోజువారి మార్కెట్, వారపు సంత, పశువుల సంత, జంతువధ శాల, కార్ల స్టాండ్, బస్టాండ్ నిర్వహించేందుకు జరపాల్సిన వేలంపాటను వాయిదా వేసినట్టు కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14న నిర్వహించాల్సిన వేలంపాట అనివార్యమైన కారణాల వల్ల వాయిదా వేశామని చెప్పారు. తదుపరి తేదీని తెలియజేస్తామన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

వీరఘట్టం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మండలంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌డీవో గోపాలకృష్ణ స్థానిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, సర్వేలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

20న మెగా వాలీబాల్ టోర్నమెంట్

మక్కువ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఈనెల 20న మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి తెలిపారు. ఆసక్తిగల వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గానీ, మహిళా పోలీసులను గానీ సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మేధా దక్షిణామూర్తి విగ్రహానికి శంకుస్థాపన

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవిద్యా సర్వమంగళా దేవి పీఠం ప్రాంగణంలో పీఠాధిపతి, ప్రముఖ నాడీ జ్యోతిష్యుడు మురపాక కాళిదాసు శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం 18 అడుగుల మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన చేశారు. ప్రముఖ భగవద్గీత ఉపాసకులు కె.రామ్మోహనరావు, గాయత్రీ ఉపవాసకులు జల్లు బాబ్జీ, అయ్యప్ప స్వామి సేవకులు సీతారామ స్వామి, శ్రీ విశ్వకర్మ సేవా సంఘం పెద్ద బి.రంగా తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

సాలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో శుక్రవారం 19 మద్యం సీసాలతో వస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని, కేసు నమోదు చేశామని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. మద్యం సీసాలు కలిగి ఉన్నా, రవాణా చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

బెల్లపు ఊట ధ్వంసం

వీరఘట్టం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బట్టిగూడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 700 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశామని ఎస్ఐ జి.కళానిధి తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ● జియ్యమ్మవలస: చినమేరంగి దళితవాడలో శుక్రవారం చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.అనీష్ ఆధ్వర్యంలో పోలీసులు జరిపిన దాడుల్లో 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు పత్తిక కాసులు, బిడ్డిక తమ్మయ్య, హెచ్‌సీ సోములు, హోంగార్డు ఉమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకర్ సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మండలం ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. ఎంపీడీవో జి.పైడితల్లి, హెచ్ఎం ఎస్ఎల్ పాత్రుడు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

గరుగుబిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చిలకాం గ్రామంలో వైసీపీకి చెందిన తాడికొండ ఎంపీటీసీ సభ్యుడు నిమ్మక భాస్కరరావుతో పాటు పలువురు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. వీరు శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షుడు పెద్దింటి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.